సున్నపుగెడ్డ జలపాతం వద్ద సదుపాయాలు శూన్యం

- నత్త నడకన ఎకో టూరిజం ఫారెస్ట్ పనులు

విశాలాంధ్ర - సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా దోనుబాయ్ పంచాయతీ పరిధిలో గల సున్నపుగెడ్డ జలపాతం ప్రాంతంలో పచ్చని అటవీ ప్రాంతం, ప్రకృతి సోయగాల నడుమ ఎంతో ఆహ్లాదకరంగా కొండలపై నుండి గలగల పాలనురగవలే జాలువారుతూ నీటి ప్రవాహం సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. అయితే జలపాతం వద్ద కనీస మౌలిక సదుపాయాలు, సెక్యూరిటీ లేక సందర్శకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ సున్నపుగెడ్డ జలపాతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండడం వలన ఎకో టూరిజం అభివృద్ధి పనులు నత్తనడకన సాగిస్తున్నారు.

న్యాచురల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జెస్, సందర్శకులు విశ్రాంతి తీసుకుని కూర్చోవడానికి సిట్టింగ్ బెంచెస్ ఏర్పాటు, జలపాతం ముఖ ద్వారం వద్ద ఆర్చి నిర్మాణం, గేట్ ఏర్పాటు వంటి పనులు ఫారెస్ట్ అధికారులు జరిపించక పోవడంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేసి సున్నపు గెడ్డ జలపాతం వద్ద సౌకర్యాలు కల్పించి సందర్శకులకు, పర్యాటకులకు ఆనందం కలిగేలా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

లక్ష్యాలకు మించి మద్యం విక్రయాలకు బెల్టుషాపులు కీలకం

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత అందరికీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉందని చెప్పడంలో అతిశయోక్తి కాదు. జిల్లాలో మద్యంషాపులు అధికారికంగా 50 ఉంటే 500 బెల్ట్ షాపులకు పైగా ఏర్పడి మద్యం వ్యాపారం లక్ష్యాలకు మించి జరగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈదశలో పోటాపోటీగా గ్రామాల్లో నేతల సహకారంతో పాటలు పెట్టి, పెద్దఎత్తున బెల్ట్ షాపులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా బెల్ట్ షాపుల కోసం ప్రత్యేకంగా సిండికేట్ వ్యాపారులు కూడా ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసిన సంగతి కూడా తెలిసిందే. బెల్ట్ షాపుల వారి నుండి ఒక్కో మద్యం సీసాకు అదనంగా పది రూపాయలు చెల్లించాలన్న ఆంక్షలు కూడా అన్నిచోట్ల వినిపిస్తుంది. బెల్ట్ షాపులు నిర్వహించే వారు కూడా ఒక్కొక్క మద్యం సీసాకు 10 నుండి 20 రూపాయలు గ్రామాల్లో అదనంగా వసూలు చేస్తున్న సంగతి కూడా తెలిసిందే. మద్యం వ్యాపారం జోరుగా కొనసాగాలని, లక్ష్యాలకు తగ్గ వ్యాపారం చేయాలన్న అధికారుల ఆంక్షలతో బెల్ట్ షాపులు వారికి వద్దన్నా ప్రతిరోజు వారి టార్గెట్ ప్రకారం పెద్దఎత్తున మద్యాన్ని షాపులవారే నేరుగా అందజేసే పద్ధతిని ఈ దఫా అమలు చేస్తున్నారు. గ్రామాల్లో కూడా గతంలో

దాడులతో బెంబేలెత్తుతున్న బెల్టుషాపుల నిర్వాహకులు

ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున పాటలు పెట్టి బెల్ట్ షాపులు పోటాపోటీగా పెట్టారు. దీంతోపాటు వారిపై ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుందని బెల్టు షాపులు నిర్వాహకులు బహిరంగంగా చెబుతున్నారు. ఎక్సైజ్, సివిల్ పోలీసులు కూడా ఎప్పటికప్పుడు దాడులు చేయడంతో పాటు స్పెషల్ స్క్వాడ్ పేరిట కూడా దాడులు చేస్తున్నారని, తమ కుటుంబం కూలి, పెట్టుబడికి తగ్గ ఎంతో కొంత లాభం వస్తుందని బెల్టు షాపులను పెట్టిన నాయకుల ఒత్తిడి, ఎక్సైజ్ సివిల్ పోలీసుల దాడులు, నెలవారి చెల్లింపులు తదితర ఆంక్షలు, గ్రామాల్లో కొంత అరువు వ్యాపారం వలస వచ్చేలాభంకన్న నష్టాలే ఎక్కువని ఆవేదన చెందుతున్నారు. పూర్తిగా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిషేధిస్తే ఇటువంటి సమస్యలుఉండవని పలువురు బయట గుసగుసలాడుకోవడం స్పష్టంగా కనిపిస్తుంది.

మరోవైపు గ్రామాల్లో బెల్ట్ షాపులు నచ్చనివారు అర్ధరాత్రిపూట 100కు డయల్ చేసి పోలీసులను ఇబ్బందులు పెడుతు న్నారు. ఇదిలాఉండగా మద్యం షాపులను డ్రాలో దక్కించుకున్న యజ మానులు కూడా తాము ఆశించిన లాభాలు రావడం లేదని వాపోతున్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికపై మంత్రి సంధ్యారాణి సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం నియోజక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ శాసనసభ్యులు, మాజీఎమ్మెల్సీలతో సోమవారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు. అందరూ తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రథసప్తమికి ప్రత్యేక బస్సు సర్వీసులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: భక్తుల సౌకర్యార్థం వారి మొక్కులు చెల్లించుకొనుటకు వీలుగా ఈనెల 14వ తేదీ రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు స్థానిక ఆర్టీసీఏ డిపో మేనేజర్ ఈఎస్ కే.దుర్గ తెలిపారు. పార్వతీపురం నుండి ఉదయం ఆరు, ఏడు గంటల సమయంలో సాధారణ చార్జీలతోనే నడుపబడతాయని కావున యావన్మంది భక్తులు ఈ బస్సులను వినియోగించుకోవాలని కోరారు.

వాహనాల జరిమానాలు సకాలంలో చెల్లించాలి

ఎస్ఐ నారాయణరావు

విశాలాంధ్ర - కురుపాం: వాహనదారులు వివిధ రకాల కారణాలతో పోలీసు శాఖ విధించిన ఫెనాల్టీలను సకాలంలో చెల్లించాలని ఎస్ఐ వి.నారాయణరావు సూచించారు. ఆదివారం కురుపాం-గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన చోదకుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ప్రతీఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని కోరారు.

బడికి దూరం చేయని విధంగా విద్యా సంస్కరణలు ఉండాలి

విశాలాంధ్ర - బెలగాం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలిలో "మహాసభల కీలక పత్రం-నేటి పరిస్థితుల్లో ఉపాధ్యాయ ఉద్యమ లక్ష్యం - కర్తవ్యాలు - ఎదుర్కొంటున్న సమస్యలు" అంశాలపై ఒక్కరోజు అధ్యయన తరగతులు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు బడికి దూరం కాకుండా ఉండే విధంగా విద్యా సంస్కరణలు అమలు చేయాలన్నారు. 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూలుకు విలీనం చేసే క్రమంలో విద్యార్థుల ఆవాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, 1 కిమీ పైగా ఉన్న విద్యార్థులను విలీనం చేయడం సమంజసం కాదన్నారు. ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులకు రెండవ సెక్షన్‌ను అమలు చేయాలని, యు.పి పాఠశాలలను యధాతథంగా కొనసాగించి స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల కన్నా ఎంతో మెరుగ్గా ఉన్న హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యాయుల ప్రగతి ప్రధాన సంపాదకులు జి. సత్యన్నారాయణ, జాతీయ విద్యా సంస్థల ఫెడరేషన్ చీఫ్ పేట్రన్ కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ధనుంజయ నాయుడు, పి.కూర్మి నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.వెంకట నాయుడు, బలరాం నాయుడు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర ద్రోహం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం చేసేదిగా ఉందని సీపీఎం నాయకులు బివి రమణ, గొర్లి వెంకటరమణ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టి మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యా సంస్థలైన గిరిజన యూనివర్సిటీ, ఐఐటి ఎన్ఐటి, ట్రిపుల్ ఐటీ, కడప ఉక్కు పరిశ్రమకు కనీస కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయలేదని, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు గతంలో కేటాయించిన కేటాయింపుల కంటే తక్కువ కేటాయి ంపులు చేశారని, ఆంధ్ర రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైన విశాఖపట్నం రైల్వే జోన్‌కు, మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు ఈ బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయిం చాల్సిన కేటాయింపులు కూడా ఈ బడ్జెట్లో చేయలేదని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో ప్రపంచ బ్యాంకు నుండి ఇచ్చిన అప్పు తప్ప బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయక పోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని అధికార కూటమి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చే విధంగా కేటాయింపులు చేసేందుకు పూనుకోవాలని లేనియెడల ఈ ప్రభుత్వం కూడా ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దావాల రమణారావు, ఎం.ఉమామహేశ్వరి, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, అంగన్వాడి, మున్సిపల్ తదితర కార్మికులను తొలగించేందుకు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేయడం, దానికి అధికార యంత్రాంగం తోడ్పడడం సరైన విధానం కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొత్తవలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందిన కార్మికులను తొలగించేందుకు స్థానిక శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర అధికారులను పురిగొల్పడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఉపాధి కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు ఉపాధి తీసి వేసేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్వాడీలపై కూడా వేధింపులకు పాల్పడుతున్నారని ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా కార్మికులను చిరు ఉద్యోగులను తొలగించే ఈ దోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది కాదని విమర్శించారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే కార్మికులందరినీ ఐక్యం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం కిలో మీటరు వెళ్లాల్సిందే...

విశాలాంధ్ర - సీలేరు: గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తుందని జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ చెక్కలమద్ది గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెక్కలమద్ది గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకం 10 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ అలాగే ఇన్ఫోసిస్ ఫౌండేషన్ బెంగుళూరు నవ నిర్మాణ సమితి వారి ద్వారా మరో 10 వేల లీటర్ల గ్రావిటీ కుళాయి ఉన్నప్పటికీ తాగునీటి సమస్య తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామంలోని కొళాయి తరచుగా మరమ్మతులకు గురవుతుందని మోటర్ మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా నిలిచిపోతుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మంచినీళ్ల కోసం కిలోమీటర్ దూరం నిమ్మ చెట్టు కాలువ వద్దకు వెళ్ళవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు కొళాయి బాగు చేసినా ఏదో ఒక సమస్య వస్తూనే ఉందని ఈ సమస్యపై సంబంధిత అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో చెక్కలమద్ది తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సమస్యను తక్షణమే అధికారులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

అరకు పూల బొకేలు తయారీలో గిరిజన యువతకు శిక్షణ

విశాలాంధ్ర - అరకులోయ: ఆంధ్రా ఊటీలో గిరిజన సంస్కృతితో సుస్థిరమైన పర్యాటక అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. అందాల అరకలోయ పూల బొకేలను రాష్ట్రానికి తొలి పరిచయం చేస్తామని చెప్పారు. చలి అరకు ఉత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పార్కుకు విశుదగల్ అని నామకరణం చేశారు. జిల్లా కలెక్టర్ తల్లి షణ్ముగ వల్లి పేరిట ఓ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు ప్రాంతంలో పూల పెంపకానికి

అవకాశం ఉందని పేర్కొన్నారు. బొకేల తయారీలో నైపుణ్యం వున్నవారిని తీసుకు రావడం జరిగిందని అన్నారు. వారితో గిరిజనులకు తగిన శిక్షణ అందిస్తామని చెప్పారు. బొర్రా నుండి డిగ్రీ కళాశాల మైదానం వరకు సైకిల్ తొక్కడం పోటీని ప్రారంభించామని చెప్పారు. సైకిల్ రైడ్‌లో 20 మంది పాల్గొన్నారని తెలియజేసారు. అరకు అబ్బాయి ద్వితీయ స్థానంలో నిలిచారని అన్నారు. అరకు బ్రాండ్ సైకిలిస్ట్‌గా తయారై రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ఆయన ఏజెన్సీకి మంచి పేరుతెస్తాడన్నారు. సైకిల్ రైడ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు: సీఐ

విశాలాంధ్ర - గంగవరం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి 13 ఏళ్ల బాలికను గర్భవతిని చేశాడనే అభియోగం మేరకు గంగవరం పోలీస్ స్టేషన్లో పోక్సో కేసు నమోదయ్యింది. పోలవరం మండలం గాజులగొందికి చెందిన 27 ఏళ్ల యువకుడిపై కేసు నమోదు చేసినట్లు అడ్డతీగల సీఐ బి.నరసింహ మూర్తి తెలిపారు. బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. రంపచోడవరం డిఎస్పీ కేసు దర్యాప్తు చేస్తున్నారని వెల్లడించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - వై.రామవరం: పీఎం జనమన్ పథకంలో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున కోరారు. బొడ్డగండి, నాగలోవ గ్రామాలలో ఇంతవరకు స్లాబ్ నిర్మాణాలు లేవని ఆయా గ్రామాలలో ప్రజలు నిర్మాణాలు చేపట్టేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన ప్రాంతాల్లో స్లాబ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

పర్యాటకులలో జోష్ నింపడానికే ట్రెక్కింగ్

బాధ్యతతో పర్యాటకులు ప్రకృతిని గౌరవించాలి

విశాలాంధ్ర - అరకులోయ: పర్యాటకులలో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని, ధైర్యాన్ని నింపటానికి ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ కార్యక్రమంలో పలువురు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అరకు చలి వత్సవ్ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజైన ఆదివారం ఉదయం సుంకర మెట్ట కాఫీ ట్రయల్ నుండి సుమారు మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి పర్యాటకులలో ధైర్యాన్ని నింపారు. పర్యాటక ప్రాంతాలను ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా మార్చాలన్న జిల్లా కలెక్టర్ ఆశయం మేరకు వారికి కనబడిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పర్యాటకులు బాధ్యతగా మెలగాలని, ప్రకృతి పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలియజేసే విధంగా ట్రెక్కింగ్ సాగింది. ఈ ట్రెక్కింగ్‌కు మధ్యప్రదేశ్‌కు చెందిన ఓపి అగర్వాల్ బృందం సపోర్ట్ చేసింది. విశాఖపట్నం జిల్లా జడ్జి ఎం.గిరిధర్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ పి.శంకర్రావు, తదితరుల ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ సజావుగా సాగింది. ట్రెక్కింగ్‌లో పాల్గొన్నవారు రకరకాల పక్షుల కూతలు, పలురకాల మొక్కల సువాసనలు, స్వచ్ఛమైన గాలి, వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ ఆరోమా ప్రభావాలను అనుభవించామని, ఫోర్ డైమెన్షన్ ఫీల్ పొందామని, ప్రకృతి ఒడిలో మైమర్చిపోయామని ఎంతో పరవశంతో చెప్పారు.

విద్యుత్ దీపాలను సద్వినియోగం చేసుకోండి

కిటుముల సర్పంచ్ రమణమ్మ

విశాలాంధ్ర - చింతపల్లి: విద్యుత్ దీపాలను సద్వినియోగం చేసుకొని గ్రామాలలోని వీధులలో విద్యుత్ దీప కాంతులు విరజిమ్మాలని కిటముల సర్పంచ్ రమణమ్మ అన్నారు. మండలంలోని కిటుముల పంచాయితీ కేంద్రంలో ఆమె చేతుల మీదుగా విద్యుత్ (వీధి దీపాల) దీపాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఆదరించి సర్పంచ్‌గా గెలిపించుకున్న పంచాయతీలోని ప్రతి ఒక్కరికి తన సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరూ సంక్షేమానికి, ఏ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదనే అభిప్రాయం ఎక్కడా వినిపించే అవకాశం లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చుతున్నానన్నారు. ఇందులో భాగంగానే పంచాయతీ పరంగా ప్రతి గ్రామంలో విద్యుత్ దీప కాంతులు విరజిమ్మాలనే లక్ష్యంతో విద్యుత్ (వీధి దీపాలు) దీపాలు అందించడం జరుగుతుందన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు సుర్ల అప్పారావు (బద్రి), గెమ్మెలి వరహాలు నాయుడు, వనుము పాపిడి రాజు (పండు) పాల్గొన్నారు.

అనాధాశ్రమ పిల్లలకు రగ్గులు, బకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - పాడేరు/హుకుంపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా వర్షిన్ మీడియా లిమిటెడ్ బృందం చెండా అయ్యప్ప ఆధ్వర్యంలో హుకుంపేట మండలం మఠం వనవాసి కళ్యాణ ఆశ్రమంలో వున్న 75 మంది అనాధ పిల్లలకు రగ్గులు, స్నానాలకు బకెట్స్, మగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్షిన్ మీడియా లిమిటెడ్ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ గతంలో పాడేరు మండల కేంద్రంలో ఉన్న అనాధ ఆశ్రమంలో ఉన్న పిల్లలకు అలాగే హుకుంపేట మండలం సన్యాసమ్మాపాలెం గ్రామంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ కూడా చేశామని అన్నారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా వున్నామని అన్నారు. ఈ సంస్థ చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వర్షిన్ మీడియా లిమిటెడ్ బృంద సభ్యులు ప్రసాద్, ఈశ్వరావు, అప్పలరాజు, దాలయ్య, వనవాసి కళ్యాణ ఆశ్రమం నిర్వాహకులు అచ్చయమ్మ, నిక్కుల సాయి ప్రసాద్, సిద్ధేశ్వరరావు, కిల్లో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు దళిత కుటుంబ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఏడుగురాళ్లపల్లి గ్రామంలో సంఘ మహిళా ఉపాధ్యక్షురాలు నాగమణి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మెల్లెం నాగేంద్ర మాట్లాడుతూ నాలుగు మండలాలో మండలాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, అనంతరం నాలుగు మండలాలు కలిపి ఒక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సంఘం అభ్యున్నతికి దోహదపడే అంశాలను గురించి చర్చించడం జరిగిందన్నారు. తదుపరి తరవాత నెల సంఘం కార్యవర్గ సమావేశం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశంలోనే ఎటపాక మండల కమిటీని కూడా ఎన్నుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ సంఘ సభ్యత్వం నమోదు వేగంగా చేయాలని, సంఘం ఆర్థికంగా బలోపేతం కావాలి అంటే సభ్యత్వాలు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాడే శ్రీనివాసరావు, కోశాధికారి గుండెపోగు శ్రీనివాస్, నక్కా రజని కుమార్,మాచర్ల వెంకన్నబాబు, గౌరవ అధ్యక్షులు గ్రామీణ వైద్యులు సాగర్, ఆనంద్, కట్టా వెంకటరమణ, చిదరగడ్డ రమేష్, గంట్ల రమేష్,గడసరి ఎనోజ్, భాగ్యరేఖ, నాగేశ్వరి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం యూనియన్ పునః ప్రారంభం

విశాలాంధ్ర - మోతుగూడెం: అల్లూరి సీతా రామరాజు జిల్లా, చింతూరు మండలం మోతు గూడెంలో తెలుగు నాడు ట్రెడ్ యూనియన్ ఆదివారం పునః ప్రారంభించారు. ఏపీ జెన్కో ఎంప్లాయిస్ 1986లో సీలేరు, డొంకరాయి, మోతుగూడెం సంయుక్తంగా యూనియన్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. కాలక్రమేనా ఈ యూనియన్ మరుగున పడింది. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో మరల తిరిగి యూనియన్‌ను కొనసాగించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం యూనియన్ ప్రారంభోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989138129, 7386603589

సోమవారం గ్రీవెన్స్ రద్దు: పీఓ

విశాలాంధ్ర - రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏలో సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. పట్టభద్రుల శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ అమల్లో ఉన్నందున ఐటీడీఏలోను, అన్ని మండలాల్లోనూ జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ప్రజలెవరు ప్రజా సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి రంపచోడవరం రావద్దని సూచించారు.

విశాలాంధ్ర
పేజీ: 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
సోమవారం 3, ఫిబ్రవరి 2025

మిధ్యగానే గిరిజన ఇంజనీరింగ్ విద్య

- ప్రారంభానికి మోక్షమెప్పుడో...?
- ఐదేళ్లు కావస్తున్నా పూర్తి కాని జేఎన్‌టీయూ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం
- బకాయిలు విడుదల కాకపోవడంతో పనులు నిలిపివేసిన గుత్తేదారు
- గిరిజన ఇంజనీరింగ్ విద్యపై కొనసాగుతున్న పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యం
- రూ.18 కోట్ల బిల్లుల బకాయిలు
- 2025-26 నుంచైనా కళాశాల ప్రారంభమయ్యేనా....
- ఆశగా ఎదురుచూస్తున్న గిరి విద్యార్థులు

విశాలాంధ్ర - కురుపాం: సకాలంలో నిర్మాణాలు పూర్తి కాకపోవడం, తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో గిరిజన ఇంజనీరింగ్ విద్య మిధ్యగానే ఐదేళ్లుగా మిగిలి పోయింది. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కురుపాంకు జేఎన్‌టీయూ గిరిజన ఇంజనీరింగ్ కళాశాలను 2020లో అప్పటి ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి చొరవతో మంజూరైంది. ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 105 ఎకరాల భూసేకరణ కేటాయింపు చేయగా సుమారు 154 కోట్లు ప్రతిపాదనలతో 2020 అక్టోబర్ 2న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జేఎన్‌టీయూ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మణానికి ఎన్‌జెఆర్ కనస్ట్రక్షన్ కంపెనీ టెండర్లు కైవసం చేసుకుని 2021లో నిర్మాణ పనులు ప్రారంభించింది. భూసేకరణ చేపట్టిన జిల్లా యంత్రాంగం సాగు చేస్తున్న టేకరిఖండి, చంద్ర శేఖర రాజపురం గిరిజన రైతులు నుంచి లాక్కున్న 32.33ఎకరాలకు నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో గిరిజన రైతులు వామపక్షాలతో కలిసి పలుమార్లు పోరాటం చేసి పనులు అడ్డుకున్నారు. రైతులకు న్యాయం చేసినంత వరకు పనులు నిలిపి వేయాలని కోర్ట్ స్టే ఇచ్చినప్పటికీ మొండిగా నిర్మాణ సంస్థ పనులు ముమ్మరంగా చేపట్టడంతో పోరాటం మరింత ఉధృతం చేసి రైతులు, వామపక్ష నాయకులు అరెస్టు అయ్యారు. సబ్ కలెక్టర్ చొరవతో రైతులు శాంతించారు. ప్రభుత్వం భూమికి భూమి ఇచ్చేందుకు అంగీకారాన్ని తెలిపింది.

అగ్రిమెంట్ ప్రకారం మొదటి ఫేజ్‌లో 122.5కోట్లు రూపాయలతో పనులు చేపట్టాల్సి ఉండగా నలభై శాతం నిర్మాణ పనులు పూర్తి చేసింది. ఎన్‌జెఆర్ కనస్ట్రక్షన్ కంపెనీ అందుకు గాను 45 కోట్లు రూపాయల బిల్లులు విడుదల చేసారు. మిగిలిన 18 కోట్లు రూపాయల విడుదల కాలేదు. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిస్థితి అర్థం కాక గుత్తేదారు పనులు నిలిపివేశారని ఎన్‌జెఆర్ కనస్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

కురుపాంకు జేఎన్‌టీయూ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల మంజూరైన నుంచి నేటి వరకు ఐదేళ్లుగా కళాశాల ఎప్పుడు ప్రారంభమౌతుందోనని కోటి ఆశలతో విద్యార్థులు వేచిచూస్తున్నారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి విజయనగరం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు ప్రారం భించడానికి అప్పటి వైసిపి ప్రభుత్వానికి జేఎన్‌టీయూ కోరినప్పటికీ అనుమతి నిరాకరించారు. ఫలితంగా నలుగేళ్ళగా ప్రారంభించడానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కురుపాం జేఎన్‌టీయూ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల తరగతులు 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థులు కోరుతున్నారు.

జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూపులు, సీట్లు ఇవే:

సివిల్, మెకానికల్, సిఎస్ఈ, ఈఈఈ, ఈసిఈ గ్రూప్‌లతో ఒక్కో గ్రూపు నకు అరవై సీట్లు జేఎన్‌టీయూ మంజూరు చేసింది. వీరికోసం 80 బోధనా సిబ్బంది, 6నాన్ టీచింగ్, 48మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరుకు అనుమతి ఇచ్చింది.

2013 భూ సేకరణ చట్టం కింద నష్ట పరిహారం ఇవ్వాలి:

ఇంజనీరింగ్ కళాశాల కోసం చేపట్టిన భూ సేకరణలో సాగుచేస్తున్న టేకరిఖండి, చంద్ర శేఖర రాజపురం కిచెందిన 26మంది రైతులకు 2013భూ సేకరణ చట్టం కింద నష్ట పరిహారం మంజూరు చేయాలని లేదా భూమికి భూమి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే పెండింగ్ 18కోట్ల రూపాయలు విడుదల చర్యలు తీసుకోవాలని, ఈవిద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - అరకులోయ: అరకు చలి ఉత్సవంలో భాగంగా నిజంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పాలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పలువురు మహిళ అధికారులు కూడా ఈ ముగ్గుల పోటీలలో పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ పోటీలలో మొదటి బహుమతి బి.దేవి, రెండవ బహుమతి ఎల్. మధు శ్రీ, మూడవ బహుమతి యు.సునీత సాధించగా మూడేళ్ల చిన్నారి చిన్మయి పోటీలు పాల్గొని అందర్నీ ఆకర్షించడంతో ఆమెకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ ఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందని, స్థానికులే కాకుండా పర్యాటకులు కూడా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎఎస్ఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ డా. ఎంజె అభిషేక్ గౌడ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, డిఆర్ఓ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజను లకు మంచి సేవలు అందిస్తే ప్రజల్లో ఏ అధికారికైనా, ఏ సిబ్బందికైనా మంచి గుర్తింపు ఉంటుందని రంప చోడవరం మొబైల్ కోర్టు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ఇ.జాన్ రాజ్ పేర్కొన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సబ్ డివిజనల్ మొబైల్ మెజిస్ట్రేట్ జాన్ రాజ్ పదవి విరమణ వీడ్కోలు సభ స్థానిక అర్క రిసార్ట్‌లో జరిగింది. న్యాయ వాదులు కోలా సత్యప్రసాద్, ఎం.వి.ఆర్ ప్రకాష్, భగవాన్, చుక్క సంతోష్ కుమార్, యం.బాల సత్యనారాయణ, జిలాని కొమ్మిశెట్టి బాలకృష్ణ, భజన వెంకటేశ్వర్లు, శివరంజని తదితరుల ఆధ్వర్యంలో మొబైల్ మెజిస్ట్రేట్ జాన్ రాజ్ దంపతులకు గజమాలతో శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జాన్ రాజ్ మాట్లాడుతూ 1986 సంవత్సరంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా కామవరపు కోట వెస్ట్ గోదావరిలో టైపిస్ట్‌గా అలాగే పలు క్యాడర్‌లలో పని చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ జనరల్ డిఎన్వి రమణ, పి హెచ్ఓ కే.చిట్టిబాబు, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డిప్యూటీ తాసిల్దారులు వీరవత్తుల రవీంద్ర బాబు, కె.విశ్వనాథ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరిడెంట్ బి కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు జై విలన్టన్ బాబు, వీరబ్రహ్మం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై నిరసన సీపీఎం శ్రేణుల నిరసన

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేసి కేంద్ర బిజెపి మరోసారి ద్రోహం చేసిందని సిపిఎం నాయకులు అన్నారు. మండలంలోని పార్టీ శ్రేణులు పాల్గొని ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రేఖపల్లి జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ బడ్జెట్లో ఏపికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిం దన్నారు. పునరావాసం, పరిహారం ప్యాకేజీ గురించి స్పందించలేదన్నారు. 55 వేల కోట్లు తాజా అంచనాలకు 33 వేల కోట్లు తగ్గిందని, పునరావసం, పరిహారం నిర్వాసితుల ఊసే లేదని అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు పంకు సత్తిబాబు, మండల కమిటీ సభ్యులు తోడం రాజు, తాతబాబు రెడ్డి, గుండె పూడి లక్ష్మణరావు, కమ్మ చిచ్చు సత్యనారాయణ, రేకపల్లి పీసా ఉపాధ్యక్షులు సార పాండురాజు, సోడి మల్లయ్య, హజరత్, సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను నిర్వీర్యం చేసే వ్యాఖ్యలు తగదు

చౌడుపల్లి సర్పంచ్ లలిత, వార్డు సభ్యుడు కరుణానిధి

విశాలాంధ్ర - చింతపల్లి: అభివృద్ధి ముసుగులో రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి హక్కులను కాలరాయాలని చూడడం పాలకులకు తగదని చౌడుపల్లి సర్పంచ్ గేమ్మేల లలిత, పంచాయతీ వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి అన్నారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా శాసనసభాపతి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆ పంచాయతీ పిసా ఉపాధ్యక్షులు ఎల్.రాజారావు, వి.దాసు, వైకాపా సీనియర్ నాయకులు సాగిన గంగన్న పడాల్, జి.సింహాచలం, అరడ గంగన్న దొర, ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం వారు మోకాళ్ళపై నిలుచుని నినాదాలతో కూడిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేకంగా 1/70 చట్టం చేసి గిరిజనులకు పలు ప్రత్యేక హక్కులు కల్పిస్తే వాటిని సంరక్షించ వలసిన పాలకులు అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. చట్టాలను సంరక్షించే అత్యున్నత స్థానంలో ఉన్న శాసన సభాపతి గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడాన్ని వారు తప్పు పట్టారు. మన్య ప్రాంతం అభివృద్ధి చెందాలంటే చట్టాలను తొలగించ వలసిన, నిర్వీర్యం చేయవలసిన అవసరం లేదని వారు అబిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో తమకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను నిర్వీర్యం చేసి తమ హక్కులను కాలరాయాలని చూస్తే గిరిజనుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వైస్ చైర్మన్ రాజేష్, వార్డు సభ్యులు, రమణమ్మ, ధనుష్, పీసా కమిటీ కార్యదర్శి జి అప్పారావు, ఆ పార్టీ శ్రేణులు జి కగుపతి, కే బాబురావు, రామారావు అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గ్లాడియోలస్ పూలు

పరిశోధనా స్థానంలో వికసించిన పుష్పాలు

విశాలాంధ్ర - చింతపల్లి: స్థానిక ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రయోగాత్మకంగా వేసిన గ్లాడియోలస్ పూలు విరగబూశాయి. పరిశోధన స్థానాన్ని సందర్శించిన పర్యాటకులను గ్లాడియోలస్ పూలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గడచిన మూడేళ్లుగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు గ్లాడియోలస్, లిల్లియం, జర్బరా, చైనా ఆస్టర్ పూలపై ప్రయోగాత్మకంగా పరిశోధనలు నిర్వహిస్తున్నారు. గ్లాడియోలస్, జర్బరా పూల సాగు మన్య ప్రాంతానికి అత్యంత అనుకూలమని శాస్త్రవేత్తలు ప్రయోగాత్మక సాగు ద్వారా నిరూపించారు. గత ఏడాది లంబసింగి ప్రాంతంలో కొంత మంది రైతులకు గ్లాడియోలస్ పూల సాగును శాస్త్రవేత్తలు పరిచయం చేశారు. రైతులకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం వల్ల సాగును కొనసాగించ లేదు. పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు సాగుచేసిన పలు వర్ణాల గ్లాడి యోలస్ పూలు ఆకర్షణీయంగా, ఏపుగా పెరిగాయి. ఈ విషయమై పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి మాట్లాడుతూ మన్య ప్రాంతంలో గ్లాడియోలస్, జర్బరా పూల సాగుకు అత్యంత అనుకూలమన్నారు. గ్లాడియోలస్ పూల కాండం ఒక్కొక్కటి మార్కెట్లో రూ.15 ధరకు విక్రయిస్తున్నారన్నారు. గిరిజన రైతులు గ్లాడియోలస్ సాగుపై ఆసక్తి కనబరిచి సాగుచేపడితే సాంకేతిక సహకారం అందిం చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పది, పదిహేను మంది గిరిజన రైతులు కలసి ఈ (గ్లాడియోలస్) సాగు చేపడితే సత్ఫలితాలు సాధించవచ్చని అదే క్రమంలో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లేకపోలేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

బీహార్ వారు సాధించుకున్నారు.. ఆంధ్ర వారు ఊరుకున్నారు....

విశాలాంధ్ర - బెలగాం: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, నితీష్ కుమార్ పార్టీల ఎంపీల మద్దతుతో అధికారంలో ఉన్న నేపథ్యంలో కేంద్ర బడ్జెట్లో బీహార్ ముఖ్యమంత్రి పోరాడి ఆ రాష్ట్రానికి నిధులు, సంస్థలు సాధించుకున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, కూటమి నేతలు మాత్రం కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఏమి ఇవ్వకపోయినా ఊరుకున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. గిరిజన సంక్షేమ కోసం బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, గిరిజన యూనివర్సిటీకి నిధులు లేవని, వెనుకకు నెట్టి వేయబడిన "ఉత్తరాంధ్ర" అభివృద్ధికి నిధులు లేవని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు ఆశించిన స్థాయిలో నిధులు లేవని అన్నారు. ఇవన్నీ ప్రజలు పోరాడి సాధించు కోవలసిందేనని రంజిత్ కుమార్ స్పష్టం చేసారు.

చౌడుపల్లిలో ఘనంగా "గొట్టి పండగ"

ధింసా నృత్యాలతో ఆడి పాడిన మహిళలు

సహపంక్తి భోజనాలతో సందడి చేసిన గ్రామస్తులు

విశాలాంధ్ర - చింతపల్లి: మన్యప్రాంత గిరిజన సంప్రదాయ పర్వదినమైన "గొట్టి పండగ"ను చౌడుపల్లి గ్రామంలో గ్రామస్తులంతా ఆదివారం ఘనంగా నిర్వహించు కున్నారు. గ్రామ శివారు మామిడి తోటలో ఒకవైపు మహిళలు, మరోవైపు పురుషులు గిరిజన సంప్రదాయ దింసా నృత్యాలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా ఆహ్వానితులతో కలిసి గ్రామస్తులంతా సహపంక్తి భోజనాలు ఆచరించారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ పూర్వీకుల నాటి నుంచి సాంప్రదాయ బద్ధంగా వచ్చే ఈ గొట్టి పండగ ప్రాశస్త్యాన్ని నేటి తరానికి వివరించారు. ప్రతి ఏట సంక్రాంతి పర్వదినం నాడు గ్రామంలోని రామాలయం వద్ద కొలువై ఉన్న చిలకల స్తంభాన్ని భజనతో ప్రతి ఇంటింటికి తిప్పడం వలన భగవంతుని ఆశీస్సులు ఆ కుటుంబాలపై ఉంటాయని గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. ఆ విధంగా ఇంటింటికి వెళ్లిన చిలకల స్తంభాన్ని ప్రతి ఒక్కరూ పూజించి తమకు తోచిన ఆర్థిక సహాయం అందించడంతో వచ్చిన ఆదాయంతో గ్రామస్తులంతా కలిసి జరుపుకునే వేడుకనే గొట్టి పండగగా సంబోధించడం జరుగుతుందని గ్రామ పెద్దలు వివరించారు. ఈ సందర్భంగా సమావేశమైన గ్రామస్తులంతా రాబోయే ఏడాదికి చేపట్టే వివిధ కార్యక్రమాలు, వాటి బాధ్యతల నిర్వహణకు గాను గ్రామస్తులందరూ ఐకమత్యంగా చర్చించుకుని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా పూర్వీకుల సంప్రదాయాలను ఎవరు విడవరాదని, గ్రామంలో ఏ కుటుంబానికి కష్టం కలిగిన అందరం ఐక్యంగా ఉండి కష్టాలను అధిగమించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు హితవు పలికారు.

పర్యాటకం అభివృద్ధికి పటిష్ట చర్యలు

చలి అరకు ఉత్సవం మిగిలిన జిల్లాలకు దిశ నిర్దేశం

ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున పారా గ్లైడింగ్

పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

విశాలాంధ్ర - అరకులోయ: పర్యాటక ప్రదేశాలు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పటిష్ట చర్యలు చేపడుతుందని పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం అరకు చలి ఉత్సవం ముగింపు కార్యక్రమంలో వర్చువల్‌గా మాట్లాడారు. టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. గత ఐదేళ్ళగా అరకు ఉత్సవాలు నిర్వహించలేదన్నారు. జనవరి 31 నుండి మూడు రోజులపాటు చలి అరకు ఉత్సవం ఘనంగా నిర్వహించారని మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా దిశా నిర్దేశం చేశారని చెప్పారు. వచ్చే ఏడాది పెద్ద ఎత్తున అల్లూరి ట్రైబల్ డెస్టినేషన్ నిర్వహిస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 9 డెస్టినేషన్‌లు గుర్తించామని చెప్పారు. అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెలలో 20 పారా గ్లైడింగ్ ఏర్పాటు చేసి క్రాస్ కంట్రీ ఫ్లయింగ్ చేస్తామని చెప్పారు. తాజంగి, జోలాపుట్ ప్రాంతాలలో పర్యాటక అభివృద్ధి చేస్తామని తెలిపారు. సాంస్కృతిక పర్యావరణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. చలి అరకు ఉత్సవం లో 300 మందితో మారథాన్, 20 మందితో సైకిల్ రైడ్ చేశామని చెప్పారు. ట్రెక్కింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. మణిపురి, నాగాలాండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్‌లో వివిధ జిల్లాల నుండి కళాకారులు పాల్గొన్నారన్నారు. గిరిజన వంటకాలతో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2026లో మరింత ఆకర్షించే విధంగా చలి అరకు ఉత్సవంను కన్నుల పండవ గా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణనన్, జాయింట్ కలెక్టర్ డా ఎం.జె.అభిషేక్ గౌడ, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్,సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ,, డి ఎఫ్ ఓ సందీప్ రెడ్డి,డి.ఆర్.వో కే.పద్మ లత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్ చంద్రకు ఘనసత్కారం

విశాలాంధ్ర - పార్వతీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ టీంతో దావోస్ పర్యటనకు వెళ్ళి పార్వతీపురం పేరును అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను నియోజక వర్గంలోని టీడీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. దావోస్, జర్మనీ పర్యటన దిగ్విజయంగా ముగించుకుని నియోజక వర్గ కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం పార్వతీపురం పట్టణంలోని సాయిష్ ప్యాలెస్‌లో ప్రైవేటుగా సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కార్యక్రమాన్ని ప్రైవేటుగా నిర్వహించినట్లు నిర్వాహక నియోజకవర్గంలోని పార్వతీపురం పట్టణం, మూడుమండలాల నుండి టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు.ఆయనసేవలను వారంతా కొనియాడారు. ప్రతి ఒక్కరు మాట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు ఎమ్మెల్యే విజయ్ చంద్ర చేస్తున్న కృషిని కొనియాడారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, గోరజాన చంద్రమౌళి, మజ్జి వెంకటేష్ పెంకి వేణు గోపాలనాయుడు, పెంకి రామ్మోహన నాయుడు, బూరాడ రవికుమార్, పెంట సత్యం నాయుడు, రౌతు వేణు గోపాలనాయుడు, సాల హరిగోపాల్, కోరాడ నారాయణరావు, బడేగౌరు నాయుడు, వెంకటరావు, వెంకటరమణ, మురళి, భాను ప్రసాద్, వంగపండు త్రినాథ నాయుడు, తవిటి నాయుడు, శ్రీవాణి, గణేష్, వి.శ్రీనివాసరావు, దామినేని భాను ప్రసాద్, జొన్నాడ తేరేజమ్మ గరికయ్య, కంకణాలపల్లి అరవింద్ కుమార్,సబ్బాన శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు, సత్తెన్నా,తెంటు వెంకటఅప్పలనాయుడు, ఉడమల సురేష్ సూర్యనారాయణ, ఏగిరెడ్డి భాస్కరరావు, రామక్రిష్ణనాయుడు, రెడ్డి సింహాచలం నాయుడు, సోమిరెడ్డి రమేష్, నాగభూషణరావు, శ్రీనివాసరావు, వంజరాపు గుంప స్వామినాయుడు, శ్రీరాములు నాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, వాకాడ పారినాయుడు, గాజాపు తాతబాబు, గొట్టాపు అప్పారావు, తెంటు రామారావు, తేలు చంద్రశేఖర్, గునుపూరు అన్నం నాయుడు, మజ్జి దత్తు, బోన శ్రీనివాసరావు, కొల్లి సురేష్, బొన్నాడ సత్యనారాయణ, సబ్బాన జగన్నాథం, మర్రాపు శంకరరావు, నీరస చంద్రశేఖరరావు జ్యోతి, కళ్యాణ బలరాం, బుడితి గోపాలకృష్ణ, పరశురాము నాయుడు, యాళ్ల రామినాయుడు, కంద్యాన రవీంద్రనాయుడు, బలగ ధనంజయనాయుడు, బూరాడ చిరంజీవి, సంజీవి నాయుడు, వేణు, బొమ్మినాయిని లక్ష్మణరావు, బోను శ్రీనివాసరావు, సూరిబాబు, ఎన్ సతీష్, సాయి, కె ఎస్ ఆర్, మర్రాపు సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ బొంగు సురేష్, మర్రాపు యోగేశ్వరరావు, గుప్తాదిత్య పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.